పదింతల ఫలితాలకు కృషి

- పదో తరగతి పరీక్షల్లో విజయానికి ప్రత్యేక ప్రణాళిక
- విద్యార్థులకు అదనపు తరగతులు
- పరీక్ష కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు



స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఉపాధ్యాయులు

పిఠాపురం: త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే 100 రోజుల ప్రణాళిక ద్వారా ప్రత్యేక తరగతుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్నారు. అత్యుత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా విద్యాశాఖ ప్రణాళికలను రూపొందించింది. దీని ఆధారంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రైవేటు విద్యార్థులకు ప్రత్యేకంగా పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. రెగ్యులర్ విద్యార్థులకు 12 పరీక్ష కేంద్రాలు, ప్రైవేటు విద్యార్థులకు ఒక సెంటర్ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ నెల 3 నుంచి ప్రారంభం కానుండగా అప్పటి వరకూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు కొనసాగుతాయి. ఈ ఏడాది ప్రతి విద్యార్థి మంచి మంచి మార్కులు సాధించే దిశగా శిక్షణ ఇస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ రోజుకో సబ్జెక్టుపై విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు.

సౌకర్యాల కల్పనపై దృష్టి

ఇప్పటికే పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసిన అధికారులు విద్యార్థులకు తగినట్టుగా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. గతంలో సౌకర్యాల లేమితో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడేవారు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలు, ఫర్నిచర్ తగినంతగా ఉండేలా ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటున్నారు. మానసికంగా విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ఇంటి దగ్గర తమ పిల్లలకు మానసిక ధైర్యాన్ని కల్పించేలా అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ శిక్షణ ఇచ్చేలా ఉపాధ్యాయులను నియమించారు.

నియోజకవర్గంలో విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
పిఠాపురం టౌన్, మండలం	30	1765
గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలం	10	283
కొత్తపల్లి మండలం	12	1091
మొత్తం	52	3139

ప్రతి సబ్జెక్టుపై అవగాహన



ప్రత్యేక తరగతుల ద్వారా అన్ని సబ్జెక్టులపైనా అవగాహన కల్పిస్తున్నారు. పరీక్షలు అంటే భయం లేకుండా మానసికంగా దృఢంగా తయారు కావడానికి మాకు ప్రత్యేక తరగతులు, అవగాహన కార్యక్రమాలు ఉపయోగపడుతున్నాయి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదువుకుంటున్నాం.

– ఎస్.నాగప్రమీల, పదో తరగతి విద్యార్థిని, తాటిపర్తి హైస్కూల్

ప్రత్యేక తరగతులతో మనోధైర్యం



పదో తరగతి పరీక్షలు అంటే ఎలా రాయాలి అనే భయం ఉండేది. ప్రత్యేక తరగతుల వల్ల మాకు మంచి మనోధైర్యం వచ్చింది. ఉపాధ్యాయులు పాఠాలు అర్థమయ్యేలా చెబుతున్నారు. డైలీ టెస్టులు నిర్వహిస్తున్నారు. పరీక్షల్లో ప్రశ్నలు ఎలా ఉంటాయి, వాటికి జవాబులు ఎలా రాయాలి అనేది పూర్తిగా అర్థమవుతోంది.

– ఎం.వీర వసంత పరిమళ, పదో తరగతి విద్యార్థిని, తాటిపర్తి హైస్కూల్

మంచి ఫలితాల సాధనే ధ్యేయం



పదో తరగతి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశాం.100 రోజుల ప్రణాళిక ద్వారా ఇప్పటికే మంచి ఫలితాలు వచ్చే విధంగా అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం 30 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. ప్రతి పాఠశాలలోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు ప్రతిరోజూ అదనంగా ఒక గంట ప్రత్యేక తర్ఫీదు ఇచ్చే ఏర్పాట్లు చేశాం. పరీక్షలు దగ్గర పడుతున్నందున వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి గ్రేడులుగా విభజించి వారికి తగిన మానసిక తర్ఫీదును ఇస్తున్నాం.

– ఆర్‌వీ ప్రసాద్, మండల విద్యాశాఖాధికారి, పిఠాపురం

క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న సురేష్

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూత్రంతో 108 ఉద్యోగి విన్నకోట సురేష్ ప్రతి ఆదివారం సత్యనారాయణపురంలో ఉచితంగా సుగర్, బీపీ పరీక్షలు చేసి రోగులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్ సమీపంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 300 మంది వైద్య పరీక్షలు చేయిం చుకున్నారు.

అధ్వానంగా నిదానందొడ్డి రోడ్డు



రాళ్లు పైకి లేచిపోయి ప్రమాదకరంగా మారిన నిదానందొడ్డి రోడ్డు

కొత్తపల్లి: మండలంలో కుతుకుడుమిల్లి శివారు నిదానందొడ్డి రోడ్డు అధ్వానంగా మారింది. రహదారి పూర్తిగా ధ్వంసంకావడంతో రాళ్లు పైకి లేచిపోయాయి. పలు చోట్ల పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. దీంతో ఈ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కుడుకుడుమిల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ఈ రోడ్డు మీదుగానే సైకిళ్లపై వాకతిప్ప, కొత్తపల్లి పాఠశాలలకు వస్తారు. రోడ్డుపై రాళ్లు పైకిలేచిపోవడంతో సైకిళ్లు మరమ్మతులకు గురవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

నిదానం దొడ్డుకు వెళ్లే రోడ్డులో పంట కాలువపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టు రక్షణ గోడకు సంబంధించిన సిమెంట్ రాళ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో రాత్రి పూట ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

శునకాల సమస్యపై చర్చకు సమాయత్తం

సామర్లకోట: పట్టణ పరిధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రతి కౌన్సిల్ సమావేశంలోను అధికార, ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నిస్తూనే ఉన్నారు. దాంతో రెండు నెలల క్రితం పశు వైద్యాధికారులతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు సమావేశం నిర్వహించి వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు ఏ విధమైన ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో సోమవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో అధికార పక్ష సభ్యులు కుక్కల బెడదపై అధికారులను నిలదీయడానికి సిద్ధమవుతున్నారు. ప్రతి వార్డులోను కుక్కలు పెరిగిపోవడం వల్ల ప్రజలు కుక్కకాట్లకు గురి అవుతున్నారు. మున్సిపల్ అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో చూడాలి.

దేవదాయ శాఖ మంత్రికి ఆహ్వానం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం వద్ద నిర్మించిన శ్రీవారి పుష్కరిణి ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఆహ్వానించారు. దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు, తుని గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, లోవదేవస్థానం ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, తుని వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అన్నవరం శ్రీను, ధర్మకర్తలు ఆదివారం తాడేపల్లిగూడెం నివాసంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. శ్రీవారి పుష్కరిణిని మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభిస్తారని, రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆత్మీయ అతిథిగా పాల్గొంటారని ఆలయ చైర్మన్ భీమేశ్వరరావు తెలిపారు. అదేరోజు మహాలక్ష్మీ అమ్మవారు, పాండురంగస్వామి, భూ వరహా స్వామి, శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి, పంచముఖ ఆంజనేయస్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కాకినాడ ఎంపీ వంగా గీత, కాకినాడ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలను ఆహ్వానించినట్టు ఆయన వివరించారు.

ఘనంగా బల్లల పండగ

కరప: రజక సామాజికవర్గం వారు ఆదివారం బల్లల పండుగ నిర్వహించారు. శివగంగ రజక సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో కొత్తపేట, పల్లపువీధి, రామకంచిరాజునగర్ కాలనీ తదితర ప్రాంతాల్లోని రజకులు తీన్‌మార్ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక సిపాయి చెరువు వద్ద చాకిరేవులోని బల్లల వద్ద రజకులు తమ కుల దేవత ఈదమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సంఘం గౌరవాధ్యక్షులు కాకినాడ ఈశ్వరరావు, సైనవరపు సత్యనారాయణ, సంఘం అధ్యక్షుడు మురమళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి సైనవరపు సతీష్, కోశాధికారి మంచాల శ్రీనివాస్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కబ్జా నుంచి వడ్రంగి సంఘ కార్యాలయానికి విముక్తి

సామర్లకోట: స్థానిక వడ్రంగి పని వార్ల సంఘ నాయకులు ఐక్యతతో విజయం సాధించారు. ఎంపీడీఓ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న వడ్రంగి పని వార్ల సంఘ కార్యాలయాన్ని ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తి కబ్జా చేసి ఇతరులకు విక్రయించడంతో వడ్రంగి పని వార్ల సంఘ నాయకులు మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ నెల 15న ధర్నా చేశారు. కౌన్సిల్ సమావేశంలో వినతి పత్రాలు అందజేశారు. దాంతో విషయం తెలుసుకున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు కబ్జాదారునకు బుద్ధి చెప్పి వడ్రంగి పని వార్ల సంఘానికి కార్యాలయాన్ని అప్పగించారు. ఆదివారం ఆ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు యండమూరి సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహిహించుకున్నారు. ఈ మేరకు 30 ఏళ్లుగా ఉంటున్న కార్యాలయాన్ని రూ.1.7 లక్షలతో మరమ్మతులు చేయించుకున్నామని సంఘ నాయకులు తెలిపారు. వడ్రంగి పని వార్ల కార్యాలయం తమకు వచ్చేలా కృషి చేసిన నాయకులు, కౌన్సిలర్ల సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

అన్నసమారాధన

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేటలో వేంచేసిన శ్రీశివమహేశ్వరీదేవి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని భక్తుల ఆర్థిక సాయంతో ఈ అన్నదానం నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రమణక్కపేట, నాగులపల్లి, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 4 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాటి అల్లరి పిడుగులే.. నేడు పెద్దలై..!



గొల్లప్రోలు హైస్కూల్‌లో 48 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



పెద్దాపురం లూథరన్ హైస్కూల్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

48 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

పిఠాపురం: కురచ నిక్కర్లు వేసుకుని బాలురు వస్తుంటే.. లంగాఓణి వేసుకుని బాలికలు వచ్చే వయసులో ఎవరి దారిన వారు విడిపోయారు. తిరిగి 48 ఏళ్ల తరువాత నాడు యువతగా విడిపోయిన వారు నేడు పంచె కట్టుకుని వృద్ధాప్యంలో కలుసుకున్నారు. గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1973–74 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో రెండు సెక్షన్లకు సుమారు 100 మంది విద్యార్థులుండగా వారిలో 50 మంది కలుసుకున్నారు. హైదరాబాద్ పవర్ గ్రిడ్‌లో విశ్రాంత ఉద్యోగిగా ఉన్న దేవగుప్తపు వెంకటరమణ ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి తనకు తెలిసిన స్నేహితుల ద్వారా అందరినీ ఒకటి చేయడానికి ప్రయత్నించారు. ఆయన సహచర విద్యార్థులు పారేపల్లి నాగేశ్వరరావు, కొశిరెడ్డి వీర్రాజు,రామకృష్ణ, గారపాటి ఆది నారాయణ, దంగేటి అప్పన్న, మలిరెడ్డి సుభద్రలు సహాయంతో ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. కాగా మిగిలిన స్నేహితులను కలుసుకునేందుకు అందరూ ప్రయత్నం చేయాలని నిర్ణయించుకున్నారు.

గిల్లికజ్జాలు.. ఆత్మీయతలూ..

పెద్దాపురం: అవన్నీ 1996 నాటి ముచ్చట్లు. నాటి పిలుపులు.. అల్లర్లు.. గిల్లికజ్జాలు.. ఆనక మళ్లీ చెట్టాపట్టాలు.. క్లాసులకు ఎగ్గొట్టడాలు.. ఎన్నో గత స్మృతులకు వేదికైంది స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాల. 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం గుడివాడ కనపర్తి గోపి తోటలో కోన వెంకట్రావు ఆధ్వర్యంలో కలుసుకున్నారు. వివిధ హోదాల్లో ఎంతో గౌరవమైన జీవితాలు గడుపుతున్నప్పటికీ ఈ సమావేశంలో చిన్నారులైపోయి చెలరేగిపోయారు. ఆహ్లాద కరమైన వాతావరణంలో ప్రతీ ఒక్కరూ ఆనందంగా, ఆప్యాయంగా పలుకరింపులు, చిన్న నాటి జోక్‌లతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు.

పొద్దెక్కినా పొగమంచు పరదాలే..!



సామర్లకోటలో పొగ మంచుతో కనిపించని రహదారి

సామర్లకోట: గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదివారం ఉదయం పట్టణం అంతా పొగ మంచు ముసిరేసింది. దాంతో అన్ని రహదారి కనిపించక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటల వరకు ఇదే పరిస్థితి. కాగా పొంగ మంచుతో మామిడి పూత దెబ్బ తింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఫిబ్రవరి ప్రారంభం నుంచి వేసవిలా ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే ఈ విధంగా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఏవిధంగా ఉంటాయోనని ప్రజలు హడలిపోతున్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన దేవి శ్రీలక్ష్మికి పతకం అందజేస్తున్న నిర్వాహకులు

తుని: స్థానిక రోటరీక్లబ్ హాలులో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ కరాటే పోటీల్లో తుని పట్టణానికి చెందిన దేవి శ్రీలక్ష్మి ప్రతిభ చూపినట్టు కరాటే కోచ్ సాకా రమణ తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. తుని శ్రీచైతన్యలో ఒకటో తరగతి చదువుతున్న తుని రూరల్ ఎస్సై బాలాజీ కుమార్తె అన్నంరెడ్డి దేవిశ్రీలక్ష్మి ప్రథమ స్థానం సాధించిందన్నారు. ప్రతిభ చూపిన దేవిశ్రీలక్ష్మిని పలువురు అభినందించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రోటరీక్లబ్ తరపున మెడల్స్ అందజేశారు.

కిరాణా షాపులో చోరీ

పిఠాపురం: పట్టణంలోని తన కూరగాయల దుకాణంలో చోరీ జరిగినట్లు షాపు యజమాని అద్దంకి శ్రీను ఆదివారం పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పిఠాపురం పట్టణ ఎస్సై జగన్మోహన్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అద్దంకి శ్రీను ఈ నెల 22న కిరాణా షాపులో ఉదయం నుంచి అమ్మకాలు జరిపి రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లిపోయాడు. 23వ తేదీ ఉదయం వెళ్లి చూడగా షాపు వెనుక షట్టర్ తీసి ఉంది. దీంతో షాపు లోపలకు వెళ్లి చూడగా గల్లా పెట్టె కనిపించలేదని, దానిలో రూ.2.40 లక్షలు ఉన్నట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు, రేపు ఆధార్ శిబిరాలు

కాకినాడ: కాకినాడలోని పది ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ (ఎఫ్‌ఏసీ) సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. ఆధార్‌లోని మార్పులు, చేర్పుల కోసం ఈ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పాత తూర్పుగోదావరి జిల్లా పేరును కాకినాడ జిల్లాగా మార్పు చేసుకోవాలని సూచించారు. అలాగే ఆధార్‌కు మొబైల్ నెంబర్, మెయిల్ ఐడి అనుసంధానంతో పాటు ఇతర సేవలను కూడా పొందవచ్చునన్నారు. నగరంలోని కృష్ణానగర్–2 (ఎ), డైరీఫారం–11(ఎ), గోళీలపేట–14 (ఎ), యానాం రోడ్డు–15 (ఎ), చిన్నమార్కెట్–21 (ఎ), యాళ్లవారి వీధి–28 (బి), జగన్నాథపురం –30 (బి), బ్యాంక్‌పేట –32 (ఎ), గాంధీనగర్–38(ఎ), గైగోలుపాడు–50(బి) సచివాలయాల్లో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు.

నేడు కార్పొరేషన్‌లో స్పందన

కాకినాడ: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన నిర్వహిస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్(ఎఫ్‌ఏసీ) సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. స్థానిక సమస్యలపై స్పందనకు వచ్చి ప్రజలు వినతి పత్రాలు ఇవ్వవచ్చునని చెప్పారు.

సంత్ నిరంకారి ఆధ్వర్యంలో జలవనరుల సంరక్షణ

కాకినాడ కల్చరల్: సంత్ నిరంకారి మిషన్ నగరశాఖ ఆధ్వర్యంలో జలవనరుల సంరక్షణ ఆదివారం నిర్వహించారు. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయం సమీపంలోని చెరువులో చెత్తను మిషన్ సభ్యులు తొలగించి శుభ్రం చేశారు. మిషన్ నగరశాఖ ప్రతినిధి కె.నగేష్ మాట్లాడుతూ మిషన్ మాతా సుదీక్షా జీ మహారాజ్ ప్రాజెక్టు అమృత్ కార్యక్రమాన్ని ఢిల్లీలో ఆదివారం ప్రారంభించారన్నారు. ఆమె ఆదేశాల మేరకు మిషన్ సభ్యులు ప్రతి నగరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కల్యాణం.. కమనీయం



తాటిపర్తిలో అపర్ణాదేవి అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



విశేష అలంకరణలో తాటిపర్తిలో నాగేశ్వరస్వామివారు

- కన్నులపండువగా అపర్ణాదేవి కల్యాణం
- వీక్షించి తరించిన భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కల్యాణోత్సవాల్లో భాగంగా తొలిరోజు అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి దివ్య కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి తరించారు. ఉదయం కల్యాణోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రి అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక, అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి కల్యాణోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది.

ధారపల్లి జలపాతం వద్ద యాత్రికుల సందడి



ధారపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న యాత్రికులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధారపల్లి జలపాతం వద్ద ఆదివారం యాత్రికులు సందడి చేశారు. సెలవు దినం కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ధారపల్లి జలపాతానికి భారీగా యాత్రికులు తరలివచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి జలపాతం వద్ద స్నానాలు చేసి సందడి చేశారు. జలపాతం ప్రాంగాణంలో ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సహంగా గడిపారు. యువత కేరింతలు కొట్టారు.

ఆర్డర్ తప్పి.. అల్లరి చేసి..



బార్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో లఘునాటిక ప్రదర్శిస్తున్న న్యాయవాదులు

- న్యాయమూర్తుల ఎదుట న్యాయవాదుల నాటకాలు
- ఆత్మీయంగా సాగిన బార్ అసోసియేషన్ సమ్మేళనం

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామ పరిధిలో అచ్చంపేట జంక్షన్ వద్ద మామిడి వనంలో కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు సందడి చేశారు. లఘు నాటికలతో (స్కిట్) న్యాయవాదులు అదరగొట్టగా ముందు వరసలో కూర్చున్న పలువురు న్యాయమూర్తులు మనసారా నవ్వులు రువ్వుతూ ఆస్వాదించారు. బార్ అసోసియేన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సంకు సింగ్, సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విందులో అంతా కలసి భోజనాలు చేస్తూ ఒకరితో ఒకరి ఆత్మీయ పలకరింపులు చేసుకున్నారు. కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి, న్యాయమూర్తులు నాగేశ్వరరావు, మల్లేశ్వరి, నిఖిత, హరినారాయణ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.